# ఓ ఇందిర కథ

# 'శమైతంగి'

అప్పుడే అరగంటనుంచి బస్సుకోసం వెయిట్‌చేస్తున్నది ఇందిర. ఎన్నో బస్సులు వస్తున్నాయి, వెళ్తున్నాయి కాని ఆమె ఎక్కాల్సిన బస్సు మాత్రం రావడంలేదు. వస్తుందనే ఆశాకనిపించడం లేదు. 'రిక్షాలో వెళ్ళిపోతే ?' అనే ఆలోచనైతే వచ్చింది గాని, నలభై పైసలతో వెళ్ళాల్సింది రెండు రూపాయ లౌతాయి. ఎలాగూఇంతసేపు వున్నాను, మరి కాస్సేపు నిల్చుంటే బస్సులోనే పోవచ్చుఇంటికి. ఎలాగూ రేపుఆదివారమే గనుక, కాస్త ఆలస్యంగా వెళ్ళినా ఫరవాలేదు, అని సమాధానం చెప్పుకుని రాని బస్సుకోసం ఆశగా నిరీక్షించ సాగిందామె.

ఎవరో వచ్చారు హఠావిడిగా. ఆమె ప్రక్కగా నిల్చుని ఆమెను కాస్సేపు పరకాయించి చూసింది. ఆమె కళ్ళల్లో ఏదో మెరుపు వచ్చింది. ఆమె దగ్గరగా జరిగి చనువుగా భుజంమీద చేయి వేస్తూ "ఇందూ ! నువ్వా ! ఇక్కడా ?" అంది సంభ్రమంగా.

మొదట ఆమెను గుర్తుపట్టలేని ఇందిర ఈ హఠాత్ సంఘటనకు కంగారుపడింది. తర్వాత నిదానంగా చూసిందామెను. మధ్య పాపిడ తీసి వాలుజడ అల్లుకుంది. చేతినిండుగా మట్టిగాజులు మధ్య మధ్య బంగారు గాజులు వున్నాయి. మెడలో నల్లపూసలతో పాటు బంగారు గొలుసు వుంది. వంటిమీద పట్టుచీర వుంది. ఆమెను ఎక్కడో ఎప్పుడో చూసినట్లుగా వుంది కాని చప్పున గుర్తు రావడంలేదు.

గుడ్లప్పగించి తననే చూస్తున్న ఇందిరవైపు కొంటెగా చూస్తూ "నేను పంకజాన్ని, నన్నప్పుడే మర్చిపోయావా ?" అందామె నవ్వుతూ.

"పంకజం నువ్వా ! చప్పున పోల్చుకోలేకపోయాను సుమా ! నన్ను క్షమించవే. నీలో చాలా మార్పు వచ్చింది." అందుకే నిన్ను గుర్తించలేకపోయాను అన్నట్లు నవ్వింది ఇందిర.

"అవును నా కట్టు బొట్టులో చాల మార్పువచ్చిందికదూ? మరేం చేయనూ. శ్రీవారి కోసం నన్ను నేను మార్చుకోక తప్పలేదు." పంకజం నిట్టూర్చింది.

"ఒకరికోసం నేనెందుకు మారాలి, ఇది నా వ్యక్తిగత విషయం. నా అలంకరణ గురించి ఎవరన్నా విమర్శిస్తే

నేనూరుకోను." తన అలంకారం గురించి ఎవరన్నా వెక్కిరిస్తే వాళ్ళమీద విరుచుకుపడే పంకజం పెళ్ళి కాగానే అతి సామాన్యంగా వుండటం చూసి నమ్మలేకుండా వుంది ఇందిర. అలా అని నమ్మక తప్పడంలేదు ఎదురుగా కనిపిస్తున్న ఆమె మూర్తిని చూసి.

నేతచీరలు గాని, పట్టుచీరలు గాని కట్టుకుని అమ్మాయిలు కాలేజీకి వస్తే వాళ్ళని చూసి "అమ్మమ్మల తరం వాళ్ళు, వాళ్ళకి ఆధునికంగా అలంకరించుకోవడం అస్సలు తెలియదు" అని చీదరించుకునేది. ఎంతసేపూ పల్చటి షిఫాన్, జపాన్ జార్జెట్ చీరలు వగైరాలు కట్టుకొచ్చేది తను. రోజు కో రకంగా అలంకరించుకుని వాటికి తగిన మాచింగ్‌తో సహా వచ్చేది.

అమ్మాయిల్లో ఎవరన్నా "ఈ రోజు శనివారం గుడికి వెళ్దామా ?" అంటే బాలు వికారంగా పెట్టేది ముఖాన్ని. "గుళ్ళు, గోపురాలు మనలాంటి అమ్మాయిలకాదు, అవి బామ్మల కోసం, అమ్మల కోసమూను. మనకెంతసేపూ పార్కులు, సినిమాలు, షికార్లు వుండాలి" అనేది. తనకి, దేవుళ్ళన్నా, దేవతలన్నా నమ్మకం వుండేదికాదు. "ఆ రాతి బొమ్మను పూజిస్తే నీకేం ఒరుగుతుంది. ఆ ఉత్స విగ్రహానికి, మాటా, పలుకా ? ఏం వుంది" అని హేళనగా, వెకిలిగా నవ్వేది. అందుకని పంకజంతో ఎక్కువ మంది అమ్మాయిలు స్నేహంగా వుండేవారే కాదు, అంటీ ముట్టనట్లు వుండేవారు.

ఇందిర, పంకజం, ఎవరి అభిప్రాయాలు, నమ్మకాలు ఎలా వున్నా స్నేహితుల్లా కలిసివుండేవారు. ఇద్దరూ ఫస్ట్‌ఫారమ్ నుంచి, ఇంటర్‌మీడియట్ వరకూ ఒకే వూరిలో వుండి చదువు కున్నారు. పంకజం నాన్నగారు హఠాత్తుగా పోవడంతోనే ఆ వూరినుంచి వారి స్వగ్రామమైన మరో వూరికి వెళ్ళిపోయారు.


బియ్యే సెకండియర్‌లో వుండగా ఇందిరకు పెళ్లయింది. అప్పటికిప్పుడు చూస్తున్నది పంకజాన్ని. ఎంతో ఫేషన్‌గా అధునాతనంగా అలంకరించుకుని ట్రిమ్‌గా వుండే పంకజం, నిరాడంబరంగా పెద్ద ముత్తయిదువులా నిండుగాకనిపిస్తున్నది. కళ్ళు వెడల్పు చేసుకుని స్నేహితురాలిని చూడసాగింది.

"నన్ను చూస్తుంటే ఆశ్చర్యంగా వుందికదూ ?" అడిగింది నవ్వుతూ.

"ఇంతా అంతానా, చాల ఆశ్చర్యంగా వుంది. పట్టుచీర కట్టేవు ఎక్కడికి వెళ్ళి వస్తున్నావు ? పేరంటానికా ? గుడికా ?"

"గుడికే వెళ్ళి వస్తున్నాను. ఈ రోజు శనివారం కదూ !"

అప్పుడు చూసింది ఇందిర ఆమె చేతిలోనిప్లాస్టిక్ బాస్కెట్‌ని. "ఉహూఁ" అంది.



"నువ్వేమిటిహఠాత్తుగా కనిపించావు? ఎక్కడనుంచి వస్తున్నావు? మీ వారికి ఈ వూరు ట్రాన్స్‌ఫరయ్యిందా? పిల్లలెంతమంది? ఏ పేటలో వుంటున్నారు?" గబగబ తన సందేహాలన్నీ ప్రశ్నల రూపంలో బైట పెట్టింది పంకజం.

"అన్ని ప్రశ్నలు ఒక్కసారేనా?" అంటూ గలగల నవ్వేసిన ఇందిర నెమ్మదిగా తన విషయాలు చెప్పింది క్లుప్తంగా. 'తను ఆరునెలలుగా అక్కడే వుంటున్నట్లు, తనకి పిల్లలు లేరని, భర్త మాత్రం అక్కడ లేడని, మరో ఊరిలో వున్నాడని, అందుకు కారణం అడగ వద్దని ఆ విషయాలు మరొకసారిచెప్తానని' ప్రామిస్ చేసింది పంకజం రెట్టించి అడిగేసరికి.

నీ వాలకం చూస్తుంటే ఉద్యోగం చేస్తున్నట్లుగా వుంది, నా అనుమానం నిజమేనా?"

సమాధానం చెప్పకుండా నవ్వి వూరుకుంది ఇందిర. కొన్ని క్షణాల నిశ్శబ్దం తర్వాత "నీ సంగతి చెప్పు, మీరు వుండేది ఇక్కడేనా? పిల్లలు ఎంత మంది? మీ వారి జీతమెంత?" అడిగింది పంకజాన్ని.

"నీ ప్రశ్నలకు, ఇక్కడ కాదు జవాబు, మా ఇంటి దగ్గర చెప్తాను." నవ్వింది సుతారంగా పంకజం.

"ఇప్పుడు మీ ఇంటికా?"

"ఇప్పుడు కాక మరెప్పుడు వస్తావు? ఈ రోజు దాటిపోతే తిరిగి మనం కలుసుకునేసరికి మరికొన్ని సంవత్సరాలు గడిచిపోతాయి. అప్పుడు మన జుట్టు తెల్లబడిపోతుంది. మన పిల్లలు అమ్మలు, నాన్నలు అయిపోతారు. అప్పుడిక మనం చెప్పుకోవడానికి మాటలే వుండవు. కనుక నువ్విప్పుడే రావాలి, వస్తావు కూడా" అన్న పంకజం అటుగా వెళ్తున్న ఆటోని కేకేసి 'కొత్తపేట' అని చెప్పి ఇందిర చేయిపట్టుకుని లాక్కెళ్ళి ఆటోలో కూర్చోపెట్టి పోనీయ్ అంది.

నిస్సహాయంగా చూడటం మినహా ఏమీ అనలేకపోయింది ఇందిర.

పంకజం చెప్పిన గుర్తు ప్రకారం ఓ అందమైన చిన్న డాబా ముందు ఆగింది ఆటో.

ఇందిర బ్యాగ్ తెరచి డబ్బు తీయబోతుంటే 'నీవు నా గెస్టువి తెలిసిందా' అని వారించి ఆటో డ్రైవర్‌కి డబ్బులిచ్చి ఇందిర చేయిపట్టుకుని ఇంట్లోకి నడిచింది పంకజం

"ఇంత దూరం వచ్చాక వెనక్కి పారిపోలేనులే, నా చెయ్యి వదులు, నేనే వస్తాను" అని ఆమె చేతిలోంచి తన చేయి లాక్కుని ఆమెను వెంబడించింది ఇందిర.

'మమ్మీ వచ్చింది,' 'ఆంటీ' వచ్చింది,' 'పిన్ని వచ్చింది' అంటూ అయిదారుగురు పిల్లలు కిలకిల్లాడుతూ వాళ్ళకు ఎదురు వచ్చారు. వాళ్ళలో పదిహేను మొదలు, మూడేళ్ళ వయసు వరకూ వున్న పిల్లలు వున్నారు. అందరిలోకి చిన్నగా వున్న పిల్లను ఎత్తుకుని ఆ పిల్ల బుగ్గలు నిమిరింది పంకజం ప్రేమగా.

"మమ్మీ అక్క కొడ్తింది మలే" అంది ముద్దు ముద్దుగా.

"అలాగా అక్కను కొడతాలే" అంది పంకజం నవ్వి. ఆ మాటతో తృప్తిపడిన ఆ అమ్మాయి తల్లి చేతిలోంచి కిందికి జారి, తతిమ్మా పిల్లల దగ్గరకు పరుగెత్తింది.

"అది మా అమ్మాయి-పేరు సుజన. వాడు మా వంశాంకురం, పేరు సురేంద్ర. ఆ పెద్ద పిల్లలిద్దరూ మా ఆడబడుచు పిల్లలు. వీళ్ళు మా బావగారి పిల్లలు"

అంటూ ఆ పిల్లల్ని పేరు పేరునా పరిచయం చేసింది. వాళ్ళంతా కోరస్‌లా "నమస్తే కొత్త ఆంటీ" అన్నారు చేతులు జోడించి.

"వచ్చావా అమ్మాయీ, ఇంకా రాలేదేంవిటా అనికంగారుపడుతున్నాను" అంటూ హడావిడిగా వచ్చింది ఓ వృద్ధురాలు. ఆవిడ వెనకాల నడివయసులో వున్న యువిధ వుంది.

అత్తగారు, ఆడబిడ్డ అని వాళ్ళని ఇందిరకు, 'నా స్నేహితురాలు' అని, ఇందిరను వాళ్ళకు పరిచయం చేసింది పంకజం.

"అలాగా, చాల సంతోషం. కూర్చోమ్మా" అని, కోడలితో మాట్లాడుతూ వుండమ్మా, ఇప్పుడే వస్తాను" అంటూ పంకజం అత్తగారుతిరిగిలోపలికి వెళ్ళింది పంకజం లెవబోతే "నువ్వు కూర్చుని మీ ఫ్రెండ తో మాట్లాడమ్మా, నేను వెళ్ళి కాఫీ తెస్తాను" అని,పంకజం ఆడబిడ్డా లోపలికి వెళ్ళిపోయింది.

"మీ ఇల్లు మనుష్యులతో చాల ఇరగ్గా వుందే, నువ్వెలా వుంటున్నావే బాబూ, నేనైతే ఒక్క క్షణం వుండలేను బాబూ ఇంత మంది మధ్య." తన మనసులో ఉద్దేశ్యాన్ని బైట పెట్టేసింది ఇందిర.

అలా అంటున్న ఇందిరవైపు తెల్లబోయి చూడసాగింది పంకజం. "మరి కుటుంబ మన్నాక వీళ్ళంతా వుండరా?" అంది అమాయకంగా చూస్తూ.

"ఇంతమంది వున్న ఇంట్లో ఎట్లా వుండగలుగుతున్నావన్నదే నా సందేహం ...మీ ఆడబిడ్డ కాపురానికి వెళ్ళదా?"

"ఆవిడ కాపురానికెళ్ళాలంటే పరలోకం వెళ్ళాల్సిందే, ఆమె భర్త ఆ పిల్లలు పసివాళ్ళుగా వున్నప్పుడే పోయారు. అప్పటి నుంచీ, ఇక్కడే వుంటున్నారావిడ పిల్లలతో. ఇక ఆమెకు ఎవరూ లేరు మేము తప్పించి. ఇక మా బావగారి పిల్లలు వుండటానికి కారణం, వాళ్ల తల్లి ఈ మధ్యే పోయింది. తల్లి లేని పిల్లల్ని ఎవరు పెంచుతారు? తండ్రి మరో పెళ్ళి చేసుకున్నాడు. ఆవిడకు ఈ పిల్లలంటే అస్సలు ఇష్టం వుండదు. అందుకే వాళ్ళని ఇక్కడే వుంచాము...."

"వుంచాము అంటున్నావు, ఈ సలహా నువ్వే ఇచ్చావా,లేక మీ వారి ఆలోచనా? ఆయన అంటే మాత్రం నువ్వెలా ఒప్పుకున్నావు?మన పిల్లల్ని మనమే పెంచుకునే స్థితిలోలేని మనం, ఇతరుల పిల్లల్ని కూడా పెంచాలంటే ఎంత కష్టం?" అసహనంగా అంది ఇందిర.

ఇతరులు ఎవరే?నా భర్త తోబుట్టువుల పిల్లలేకదా నా భర్త ఆపులు,నాకూ ఆపులే కదా? నాకు నా అన్న తమ్ములు అక్క చెల్లెళ్ళు వాళ్ళ సంతానం ఎంత ముఖ్యలో నా భర్తకి తనబంధువులు అంత ముఖ్యలే కదా" అంది పంకజం.

"ఏమో బాబూ, నాకైతే అటువంటి బంధాలు ఇష్టం వుండదు. భర్త, పిల్లలు

అంటూ వంటరిగా వుండకుండా, ఇంత మంది మధ్య వుండటం, ఎంత బాధగా, విసుగ్గా వుంటుందో...భర్తతో కలిసి హాయిగా సినిమాకో, షికారుకో తిరక్కుండా అనాధ శరణాలయంలా ఇంతమందిని వెంటబెట్టుకుని తిరగాలంటే ఎంత చికాకుగా వుంటుందీ? అందుకే అమెరికాలాంటి దేశాల్లో వృద్ధులైన వారికి వేరే వసతి సౌకర్యాలు వుంటాయట. పెళ్ళయిన జంటలు హాయిగా, హేపీగా వుంటారు. వెనకాల అత్తా ఆడబిడ్డల బాధ లేకుండా. అటువంటి పద్ధతి మన ఇండియాలో కూడా రాకూడదూ."

"విదేశాల్లో ఆడవారు, కట్టుకున్న భర్త నచ్చకపోతే వెంటనే అతనికి విడాకులు ఇచ్చేసి మరో పెళ్ళి చేసుకుంటారు. అలా ఎన్ని పెళ్ళిళ్ళయినా చేసుకుంటుంది హాయిగా, ఆడది అలా మనం కూడా చేసుకుందామంటావా?" సీరియస్‌గా అడిగింది పంకజం.

"ఛీ...ఛీ...అలా ఎందుకు చేసుకుంటాము...? కట్టుకున్నవాడు, మంచివాడైనా, దుష్టుడైనా, దుర్మార్గుడైనా ఆ ఒక్కడితోనే మన తనువు వెళ్ళిపోవాలి. భర్త కిష్టం లేక ఆమెన విడిచి పెడ్తే ఆలో లక్షణా అని ఏడవ్వాల్సిందే గాని మారు మనువుకి చస్తే ఒప్పుకోదు మన భారత స్త్రీ, ఇప్పుడిప్పుడు, అటువంటివారు, భర్త పోయిన యువతులు, పాత సంప్రదాయాన్ని, కట్టుబాట్లను సడలించుకుని పునర్వివాహం చేసుకుంటున్నారనుకో. కాని అది చాల అరుదేలే. కాని నా ఉద్దేశ్యం ఏమంటే..." ఆగింది ఇందిర మాట పూర్తిచేయకుండా.

"ఇతర బంధాలేవీ లేకుండా తనూ, భర్తా చిలకా గోరింకల్లా వుండాలంటావు" ఇందిర అసంపూర్తిగా వదిలేసినమాటను పూర్తిచేసింది పంకజం.

"కొన్నాళ్ళన్నా ఫ్రీగా లేకుండా అత్తా, మామా, ఆడబిడ్డ, మరిది అంటూ ఈ చికాకు లెందుకు బాబూ" ముఖం చిట్లించి ఇందిర అంటుంటే పంకజం నవ్వకుండా వుండలేకపోయింది. అయితే నువ్వు ఆరునెలలుగా ఇక్కడే వున్న కారణం ఇపుడు అర్థం అయిందిలే. మీ అత్తా మామలు మీతో కలిసి వుండటం నీకు ఇష్టంలేక, లక్షణమైన కాపురాన్ని తెంచుకుని వచ్చేసి వుంటావు అవునా?" అడిగింది పంకజం.

ఇందిర మాట్లాడలేదు. మౌనం అర్ధాంగీకారంగా వుండిపోయింది.

"కాని ఇది మంచి లక్షణం కాదు ఇందూ. నీ పుట్టిందినే ఊహించుకో. నీకు అక్కా చెల్లెళ్ళు, అన్నదమ్ములు అంటూ చాలా బలగమే వుండవచ్చు. మీ అన్నయ్యకు పెళ్ళవుతుంది మీ వదిన వస్తుంది. ఆవిడకు మీ వాళ్ళెవరూ ఇష్టం వుండదు. మీ వాళ్ళు వుంటే నేను వుండను. మీ వాళ్ళను విడిచి మనం దూరం పోయి వుందాము, వంటరిగా 'అంటుందనుకో'

అప్పుడు నీ కెలా వుంటుంది? మీ వదిన గారి ఉద్దేశ్యం మంచిదని అనుకోగలవా? భార్య పోరు పడలేక వేరే వెళ్ళి కాపురం పెట్టిన అన్నగారిని మెచ్చుకోగలవా? ఒక్కనాటికీ మెచ్చుకోలేవు సరికదా భార్యా విధేయుడు అని బిరుదిచ్చి అతన్ని ఏవగించుకుంటావు. అలా కాక అతను తన భార్య మాటకు విలువనివ్వకుండా తన తలిదండ్రులను, అక్కచెల్లెళ్ళను, అన్నతమ్ములను విడవకుండా ప్రేమగా, అభిమానంగా చూచుకుంటే మా అన్నయ్య చాల మంచివాడు. మేమంటే ఎంత ప్రేమ, పెళ్ళయినా వాడి మనసు మారలేదు. ఇటువంటి అన్న లభించడం మా అమ్మా నాన్నల అదృష్టం అని మురిసిపోతావు, పొంగిపోతావు, ఎందుకని? మన సంప్రదాయాలు, ఆచారాలు, మన ప్రేమాభిమానాలు మనలో బంధుప్రీతిని పెంచుతాయేగాని తుంచలేవు. మన జీవన విధానమే వేరైనది. మనకి 'నా' అన్న వాళ్ళంతా కావల్సినవాళ్లేను. మనకి స్వేచ్ఛ కావాలని, అత్తింటివారిని దూరం చేసుకోవడం భావ్యంగా వుంటుందా? కొడుకుల కోసం కలవరిస్తారు ఎందుకని? తమ వృద్ధాప్యంలో ఆదుకోవాల్సినవాడు కొడుకే. ఇష్టం వున్నా లేకపోయినా లోకం కోసం అయినా, కర్తవ్యపాలన కోసం అయినా తల్లి తండ్రులను, తలచెడిన తోబుట్టువుని, తన కన్న చిన్నవారిని ఆదుకోవలసిన వాడు కొడుకే గనుక, అటువంటి కొడుకు కావాలని కోరుకుంటారు తలిదండ్రులు.

తమని ఆదుకోవలసిన కొడుకు పెళ్ళి కాగానే భార్యా విధేయుడై, స్వార్థపరుడై తన దారి తాను చూసుకుంటే, ఆ కొడుకు మీద ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆ కన్నవారి మనసు ఎంత ఆక్రోశిస్తుందో ఆడది అవగాహన చేసుకుంటే ఆ అత్తవారి నుండి తన భర్తను విడదీయాలని కలలో కూడా అనుకోదు. తన అన్న తమ్ములు మాత్రం, పితృ విధేయులై వుండాలని, తన భర్త మాత్రం తను గీచిన గీటు దాటకూడదని స్వార్థపరురాలైన ఆడది మాత్రమే కోరుకుంటుంది. అలా అని తన భర్త సంపాదనంతా ఆ అత్తా ఆడబిడ్డలకేదారపోయమని కాదు నా అభిప్రాయం. వాళ్ళు కూడా తన ఆప్తులేకదా, అనే సమదృష్టి వుండాలి అంటాను. అత్తా ఆడబిడ్డ స్థానాల్లో వున్న స్త్రీలు కూడా తమ ఇంటికి వచ్చే నవ వధువుని ప్రేమగా, ఆదరించాలి. ఆమె వ్యక్తిత్వాన్ని గౌరవించాలి. ఆమెను ఆ ఇంటి గృహిణిగా, ఆడపడుచుగా మన్నించి ఆదరాభిమానాలు చూపించాలి. అప్పుడే ఆ నవవధువు ఆ ఇంటి వాతావరణంలో పాలూ నీరూలా కలిసిపోగలదు. నన్నే చూడు, మా అత్తా ఆడబిడ్డ ఎంతో అభిమానంగా చూస్తారు. వాళ్ళంటే నాకూ అంత అభిమానంగానే వుంటుంది. ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే, ఒక వ్యక్తి భార్యగా, గృహిణిగా

ఇంట్లో అడుగు పెట్టిన ఆడది ఆ కుటుంబ శ్రేయస్సుకై ఆలోచించాలి. తను సుఖ పడి, తన చుట్టూ ఉన్న వారిని సుఖ పెట్టాలి, అందుకోసం ప్రయత్నించి సాధించాలి. అంతే గాని సమిష్టిగా వున్న కుటుంబంలో చీలికలు తీసుకు రాకూడదని ఉద్యోగ రీత్యా దూరంగా వెళ్ళిపోవలసివస్తే అది సమస్యే కాదు. కాని తప్పనిసరి పరిస్థితుల్లో ఉమ్మడిగా ఉండాల్సి వచ్చి నప్పుడు భరించాలి తప్పదు." పంకజం ఆవేశంగా లెక్చరిస్తు దే దిగ్భ్రాంతిగా చూస్తూండిపోయిందేగాని, పెదవి కదిపి ఒక్కమాటా చెప్పలేకపోయింది ఇందిర, పంకజం ఆవేశం తగ్గి మామూలు ధోరణిలో పడ్డాక "రాజకీయాల్లోకి దూక పోయావా, పనికి వచ్చేదాని..." వ్యంగ్యంగా నవ్వింది ఇందిర.

"అందుకు పనికివచ్చేవారు వేరే వుంటారులే. సంసారమనే ఈ రాజకీయాల్ని దాటనియ్యి ముందు" తనూ తేలిగ్గా నవ్వేసింది పంకజం.


చిన్నమాటకు ఎంత పెద్ద ఉపన్యాసం ఇచ్చావే నీ కట్టు బొట్టుతో పాటు నీ హృదయాన్ని కూడా సంస్కరించారన్న మాట మీ శ్రీ వారు. అయితే ఆయన్ని తప్పకుండా మెచ్చుకోవాల్సిందే. మొత్తానికి నిన్ను మీ శ్రీవారు తన అభిరుచులకు అనుగుణంగా మలచు కున్నారు.

"ఆయనేం నన్ను మార్చలేదు. భర్త కనుగుణంగా, ఆయనకు నచ్చే పద్ధతిలో నడుచుకుంటేనే ఎక్కువ ఆనందం లభిస్తుందని నన్ను నేనే సంస్కరించు కున్నాను, ఆనందిస్తున్నాను కూడా." ముఖాన్ని ముడుచుకుంటూ అంది పంకజం.

"కేవలం ఆయన మనసు గ్రహించే మార్చుకున్నావా నీభావాలను అసంభవం" నమ్మలేనట్లు చూసింది ఇందిర.

"నిజంగా, ఆయన నోరు తెరచి, అలా వుండకు, ఇలా వుండు, అని ఏ ఒక్కరోజూ నాతో అనలేదు. నేను అతిగా అలంకరించుకున్న రోజున, చాల ముభావంగా, పరాయి వారిలా ప్రవర్తించే వారు. అలంకరించుకోవడానికి బద్ధకించి సింపుల్‌గా వున్న రోజున నాతో చాల క్లోజ్‌గా వుండేవారు. నేను అడక్కుండానే నన్ను సినిమాకో, షికారుకో తీసుకెళ్ళే వారు. "ఈ రోజు నా కంటికి చల్లగా ఆహ్లాదకరంగా కనిపిస్తున్నావు సుమా!" అని ప్రశంసించేవారు. అదీగాక ఓ చిన్న సంఘటన నా స్వభావాన్ని మార్చి వేసిందంటే నమ్ముతావా?"

ఓ రోజు గుడికి బయలుదేరాము, నేనూ ఆయనాను. నేను పల్చటి షిపాన్ చీర కట్టుకుంటే ఆయన అదోలా నవ్వుతూ "మనం వెళ్లేది పార్టీకి కాదు, గుడికి. కనుక కాస్త సభ్యతగా వెళ్తే బాగుంటుం దేమో అన్నారు. ఆమాటలోని వ్యంగ్యాన్ని అర్థంచేసుకుని, అయిష్టంగానే పట్టుచీర




కట్టుకుని తలలో పూలు పెట్టుకుని బయలుదేరాను. టాక్సీలో వెళ్ళకుండా బస్సులో వెళ్ళాము ఆదే బస్సులో ఇద్దరు యువతులు ఎక్కారు. వాళ్ళ వయసు పాతికపైన, నలభైలోపు వుంటుందేమో. చాల ఫేషన్‌గా వున్నారు. పల్చటి చీరలు వాళ్ళ వయసుని దాచడంలేదు. వాళ్ళ వెనకాల నలుగురు అబ్బాయిలు పడ్డారు. రకరకాల మాటలతో, గూడార్థాలతో వాళ్ళని ఏడిపిస్తున్నారు. ఆ యువతులు పాపం చాల సిగ్గుపడిపోతున్నారు. కాని అబ్బాయిలను ఏమీ అనలేకపోతున్నారు. వాళ్ళున్న పరిస్థితిలో నా ప్రక్కన ఓ పండు ముత్తయిదువ కూర్చుని వుంది. ఆవిడ తన దగ్గర కూర్చున్న ఆమెతో నన్ను చూపిస్తూ "ఆ అమ్మ ఎంత లక్షణంగా వుంది, వాళ్ళు చూడు ఎలా వెకిలిగా, అలంకరించుకున్నారో, అబ్బాయిలు ఏడిపించారంటే మరి ఏడిపించరా, అటువంటి వాళ్ళను చూసి" అని. ఆ మాటలు వింటున్న నాకు వళ్ళు జలదరించింది. ఆ సమయంలో నేను వాళ్ళలా అలంకరించుకోనందుకు నన్ను నేను చాల అభినందించుకున్నాను. ఆ రోజునుంచే నేను చాల మారిపోయాను. తక్కువ అలంకారంతో ఎక్కువ ఆదరణను ఆయననుండి పొందుతున్నాను. నన్ను చూసుకుని నేను గర్వపడేకన్న, ఇతరుల నుంచి ఎక్కువ ఆనందాన్ని, తృప్తిని పొందడమే నాకు ఎక్కువ సంతోషాన్ని కలిగిస్తున్నదప్పుడు.

నా యిష్టప్రకారము, నాకు నచ్చిన రీతిలో నడుస్తాననుకో, అప్పుడు నాకు లభించేది నా ఒక్కదాని ఆనందమేను. కాని ఇప్పుడో, ఇంట్లో అందరిచేతా

మన్ననలు పొందుతున్నాను. నేనంటే శ్రీవారు ప్రాణం పెట్టారు. అత్తా, ఆడ బిడ్డలు, ప్రతిక్షణమూ నా గురించే ఆలోచిస్తారు. పిల్లలు నేను కనిపించకపోతే కలవరించిపోతారు. ఇప్పుడు చెప్పు ఆడదానికి ఇంతకన్న కావాల్సిందేమిటి?" పంకజం నవ్వుతూ ఇందిరవైపు చూసింది. ఆ నవ్వులో ఎన్నో ప్రశ్నలు 'ఇలా నీవు నీ జీవితంలో సాధించ గలిగేవా? సాధించగలవా? నీ వల్ల నీ ఇంట్లో ఎవరికైనా తృప్తివుంటుందా?' అనేవి తొంగిచూసినట్లు ఊహాగానం చేసిన ఇందిర మనసులోనే ఉలిక్కి-పడింది. తప్పు చేసిన అపరాధిలా లోలోపల ముడుచుకుపోయింది. ఆమెకు ఆలోచించుకోవడానికి వ్యవధి నిస్తున్నట్లుగా, "కూర్చో" ఈ పిక్చర్ తిరగేస్తుండు. చీర మార్చుకొస్తాను" అంటూ ఆ చోటు విడిచి వెళ్ళిపోయింది పంకజం.

పంకజం అత్తగారు, కాఫీ, టిఫిన్ తెచ్చి ఇందిర ముందు పెట్టింది. అవి తీసుకోవడానికి ఇందిర మొహమాట పడినా ఆవిడ ఊరుకోలేదు. ఆవిడ బలవంతంమీద తిన్నానన్న పేరుకి కాస్త తిని కాఫీ త్రాగింది ఇందిర.

తర్వాత ఇందిర స్వవిషయాలు అడిగింది. అన్నిటికీ చాల క్లుప్తంగా జవా బిచ్చింది ఇందిర. ఓ అరగంట కూర్చుని లేచిందామె వెళ్తానంటూ. అసలు ఆ పూటకు అక్కడే వుండిపోమని బలవంతం చేసారు వాళ్ళంతా. ఇంటిదగ్గర తన కోసం ఎదురుచూస్తారంటూ బయల్దేరింది ఇందిర, వినకుండా. పంకజం, బస్టాండు వరకూ వచ్చి ఇందిరను బస్సెక్కించి వెళ్ళింది

బస్సులో కూర్చున్న ఇందిరకు పంకజం కుటుంబమే గుర్తుకురాసాగింది. పంకజం కుటుంబం ఎంత హాయిగా వుందో, స్వేచ్ఛగా స్వతంత్ర భావాలతో పెరిగిన పంకజం అంతమందిలో తానూ ఓ మనిషిగా కలిసిపోయి, నేర్పుగా, ఓర్పుగా సంసారాన్ని చేసుకుంటున్నది కాని తానో నలుగురి మధ్యా పెరిగినా, పదిమందిగల కుటుంబంలో నిలవలేక స్వేచ్ఛని కోరుకుంటూ వచ్చేసింది. వచ్చిన కొత్తలో వారానికి ఓ ఉత్తరం వచ్చేది భర్త దగ్గరనుంచి "నువ్వు ఎప్పుడు వచ్చేది తెలియజేస్తే వచ్చి తీసుకెళ్తాను అంటూ. తనకింకా తెలియదు, ఆ సంసారం చేయడం ఇష్టంలేకే తను వచ్చేసినట్లు, ఇక్కడ తను ఓ ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నట్లూను. ఆ ఉత్తరాలన్నీ చదివి పొయ్యిలో పారేసేది. కనీసం జవాబు కూడా ఇచ్చేదికాదు. కాని పంకజం భర్త ఆనందం కోసం, అతని బలగం కోసం తనని తనే మార్చుకుంది. సంతోషంగా తృప్తిగా బ్రతుకుతున్నది. కాని తనో...? 'నీ కోసం, నీ ఆనందం

కోసం, నీ స్వేచ్ఛ కోసం నువ్వు బ్రతుకుతున్నావు' అంది మనసులోని మరో మనిషి. 'అవును నా కోసం నేను బ్రతుకుతున్నాను అంతే ' నిర్లిప్తంగా గొణుక్కుందామె.

ఆమె ఆలోచనలకు బ్రేకుపడింది వెనక సీటులోంచి వినిపిస్తున్న మాటలకి వెనక్కి తిరిగి చూసింది ఇద్దరు నడివయసు దాటిన స్త్రీలు కూర్చుని, బిగ్గరగా మాట్లాడుకుంటున్నారు.

ఎర్ర చీర కట్టుకున్న ఆమె అంటున్నది. "వాడు మాత్రం ఎన్నాళ్ళు ఆగుతాడమ్మా? వయసులో వున్నవాడు, కోరిక లేకుండా వుండటానికి వాడేమైనా సన్యసించాడా? అందుకే మేమంతా పట్టుబట్టి మళ్ళీ పెళ్ళి చేయించాము ఈసారి చదువుకున్న పిల్లని చేయలేదులే ఏదో కాస్త అక్షరజ్ఞానం వున్నపిల్లయితే చాలన్నాడు వాడేను. ఓసారి చదువుల బొమ్మను చేసి అనుభవించాము కదా." గళ్ళ చీరావిడ అంటున్నది. "మరి ఈ సంగతి అదే తన మొగుడు మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడని ఆ అమ్మాయికి తెలిసిందా?" అని.

"ఎందుకు తెలియదూ?! ఓ వేళ తెలియకపోతే ఈ తర్వాత తెలుసుకుంటుంది. అమ్మ పెట్టా పెట్టదు,అడుక్కు తినానియ్యదు అన్నట్టు తనూ కాపురం చేయక, మరో ఆడదాన్ని రానివ్వదా? అయినా ఇప్పుడు దానికేం లోటు. బళ్లో మేస్టరుపని చేస్తున్నదట. నెమ్మదిగా ఎవరో చేరదీస్తారు. ఈ రోజుల్లో ఇలా జరగడం మామూలైపోయింది వదినా. మా సుగుణ మొగుడు వాళ్ళ ఆఫీసులో పనిచేసే అమ్మాయిని ఉంచుకున్నాడు. మొదట్లో మా సుగుణ మొగుడు చేసిన పనికి పోట్లాడింది, ఏడ్చింది అలిగింది, పుట్టింటికి పోయింది. 'నువ్వు ఏమన్నా కా నేను మాత్రం ఆ అమ్మాయిని వదిలిపెట్టేది లేదు అని కరాఖండిగా చెప్పేసాడు నువ్వూరా, నిన్నూ నీ పిల్లల్ని లోటు రానివ్వకుండా చూసుకుంటాను. అన్నాడు చదువాట్టే లేని మా సుగుణ, భర్త చాటున బ్రతకడం నేర్చుకున్న మా సుగుణ చేసేదేంలేక తిరిగి ఆ భర్త దగ్గరకే వచ్చింది మరో మార్గం తెలియక. ఉంచుకున్నదాన్ని, మా సుగుణను కూడా బాగానే చూసుకుంటున్నాడు మన దేశంలో ఆడది, తండ్రి చాటునా, లేక భర్త చాటునా, లేదా అన్నదమ్ముల పంచనా తప్పించి వంటరిగా, ధైర్యంగా బ్రతకలేదు. చదువుకున్న పిల్లలైతే ఏ కాస్త పొరపాటు జరిగినా ఈ మొగుడూ వద్దు,ఈ కాపురమూ వద్దని ఇప్పుడిప్పుడు వీధులెక్కుతున్నారనుకో." 'అడ్డ రోడ్డు' అంటూ అరిచాడు కండక్టరు. ఎర్ర చీర. గళ్ళ చీర ఉలిక్కిపడిలేచాయి. కంగారు పడుతూ కిందిగి దిగాయి. వాళ్ల వెనక్కాలే దిగింది ఇందిర. ఆమె మనసంతా చేదు మాత్ర తిన్నదానిలా అశాంతిగా, తిక్క

తిక్కగా వుంది. కొంపదీసి తన భర్త కూడా మరో పెళ్ళి చేసుకోడుగదా? అందులో ఆశ్చర్యం ఏముంది? అసలీ పాటికే ఎవరినన్నా చేరదీసి వుండొచ్చు. అందుకే తన దగ్గరనుంచి ఉత్తరాలు రావడం కూడా ఆగిపోయాయి. ఆ ఆలోచనరాగానే మనసుకో ఏదో ఆరాటం ఆందోళనా బయలుదేరాయి ఓ వేళ అదే నిజమైతే తను ఏం చేయగలదు? ఊహూం ఏమీ చేయలేదు. 'నా భర్త నన్ను వది లేసాడు నాకు అన్యాయం చేసాడు' అని సిగ్గు విడిచి కోర్టు కెక్కగలదా? నిజానికి ఆ రెండు పనులు అంటే, భర్తని వదిలి పెట్టడం. ఆ సంసారం నాకక్కర్లేదు, అని వచ్చేసిందే తను, అటువంటప్పుడు, సిగ్గూ అభిమానం వదిలేసి ఎవరితో మొరపెట్టుకుంటుంది?' ఆలోచన్లతో నడుస్తున్న ఇందిర ఓ రిక్షా కింద పడబోతే దారేపోయే వారెవరో చటుక్కున ఆమె చేయి పట్టుకుని ఇవతలకు లాగారు.

"రోడ్డు మీద నడిచేటప్పుడు కాస్త జాగ్రత్తగా వుండాలమ్మా అని హెచ్చరించాడతను.

అతనికి కృతజ్ఞత చెప్పుకుని గబగబ నడిచి ఇల్లు చేరుకుందామె.

మూసివున్న తలుపుల మీద చేయి వేస్తూ ఆగిపోయింది. గదిలోంచి అన్నా వదినలు మాట్లాడుకోవడంవినిపిస్తున్నది.


"మీకు మరో వూరు ట్రాన్సఫరయి నట్లు మీ చెల్లెమ్మకు చెప్పారా?" అని అడుగుతున్నది వసంత

"ఇంకా లేదు, ఆ విషయమే ఆలోచిస్తున్నాను," అంటున్నాడు ప్రకాశం.

"ఆ ఉత్తరం అయినా చూపించారా?"

"ఊహూ, అప్పుడే చెప్పడం ఎందుకని ఆగాను అదీగాక ఆ ఉత్తరంలోని సంగతులు ఎంతవరకు నిజమో తెలుసు కోకుండా ఆ విషయాలు బైటపెట్టేదాని మనసు నొప్పించడం నాకిష్టం లేదు. నువ్వు మాత్రం ఆ ఉత్తరాన్ని ఇందు కళ్ళబడకుండా చూడు. ఎప్పుడో రాబోయే ప్రళయం ఇప్పుడే వస్తుంది లేకపోతే" అనే అన్నగారి మాటకు మనసులోనే తృళ్ళిపడిన ఇందిర, 'ఎక్కడ నుంచి వచ్చింది? ఎవరు రాశారు ఆ ఉత్తరాన్ని? అనుకుంది కంపరంగా. ఓ వేళ ఆ ఉత్తరంలోని విషయాలు నిజమే అయితే ఏం చేస్తారు? కోర్టు కెక్కుతారా?" వసంత సందేహాన్ని వ్యక్తం చేసింది మళ్ళీ.

"ఓ వేళ కోర్టు కెక్కినా మనమే ఓడిపోతామేమో...'నా భార్య కాపురానికి రావడంలేదు మరి మళ్ళీ వివాహం చేసుకోక ఏం చేయను' అనే పాయింటు తీస్తాడేమో అయన. ఏది చేసినా ముందు దానిలో నిజా నిజాలు తెలుసుకుని, ఆ తర్వాత ప్లీడరుతో సంప్రదించిగాని ఏదీ చేయను. ఇందు వచ్చేస్తుందేమో ఆ మాటలు ఎత్త వద్దిక" అని ప్రకాశం




అనగానే వసంత మౌనంగా వుండిపోయింది.

అప్పుడే వచ్చినట్లు శబ్దం చేస్తూ 'వదినా' అన్పిలిచింది ఇందిర. ఎక్కడ వాళ్ళు అక్కడ స్థంభించుకుపోయినట్లు అతి నిశ్శబ్దంగావున్న గదిలోకి వాడిపోయిన ముఖంతో అడుగు పెట్టింది ఇందిర

"ఆఫీసులో పని తెమలలేదా? లేక బస్సు అందలేదా? నీకోసమే బయలు దేరుతున్నారు మీ అన్నయ్య." పెదవుల మీదకు నవ్వు తెచ్చిపెట్టుకుంటూ అంది వసంత.

"ఎందుకూ రావడం? నేనేమైనా చిన్నపిల్లనా రాలేకపోవడానికి? నే నెక్కిన బస్సు దారిలో చెడిపోయింది. అది బాగుచేసి తిరిగి బయలుదేరేసరికి ఈ టైమయ్యింది" ఇందిర బట్టలు మార్చు కోవడానికి గదిలోకి వెళ్ళిపోయింది.

'అన్నం తిందువుగాని రా' అని వసంత ఎంత పిలిచినా 'నాకు ఆకల్లేదు వదినా' అంటూ కూర్చుంది. మనసులో రెండు ప్రశ్నలు తలెత్తి ఆమె మనసుకి శాంతి లేకుండా చేస్తున్నవి

ఒకటి 'అన్నయ్యకు ట్రాన్స్ఫరై వెళ్ళిపోతే తను వంటరిగా ఎక్కడ వుండాలి? అన్నది. రెండోది ఆ ఉత్తరం ఎక్కడనుంచి వచ్చింది? ఎవరు రాశారు? ఏమని రాసారు? ఆ ఉత్తరానికి, నా భవిష్యత్తుకి సంబంధ మేమిటి?' అనేది. ఈ రెండు ప్రశ్నలు ఇంతై, అంతై చివరకు ఆమె మనసంతా ఆక్రమించుకుని కుమ్మరి పురుగులా దొలుస్తున్నది మనసుని.

తనకి కాస్త మజ్జిగ ఇచ్చి అన్నా వదినలు భోజనానికి కూర్చున్నాక ఆ ఉత్తరంకోసం గాలింపు మొదలు

పెట్టింది ఇందిర ఎక్కువ శ్రమపడకుండానే ఆ ఉత్తరం దొరికిందామెకు.

దానిమీద ఉన్న అడ్రసునిబట్టి అది అములాపురంనుంచి వచ్చినట్లు, అన్నగారి స్నేహితుడు మురళీకృష్ణ అనే అతను దాన్ని రాసినట్లు గ్రహించి ఆ ఉత్తరాన్ని ఆమూలాగ్రంగా చదివేసింది. తర్వాత తెలిసిన విషయం ఏమంటే ? తన భర్త ఆ ఊరు పెళ్ళిచూపులకోసం వెళ్ళినట్లు గ్రహించి ఆమె మనసు ఉక్కిరిబిక్కిరై పోయింది ఓ క్షణం. ఇది నిజమేనా ? తన భర్త మరో పిల్లను పెళ్ళిచేసుకోవడానికి సిద్ధపడుతున్నాడా? ఎంత నీచం...ఛీ...ఛీ...ఇందిరకు భర్తమీద ఎంతో అసహ్యం వేసింది. భార్య బ్రతికి వుండగానే మరో పెళ్ళా ? ఇందుకు చట్టం ఒప్పుకుంటుందా ? ఎందుకు ఒప్పుకుంటుంది ? కాని చట్టం దృష్టిలోపడి నేరం రుజువు కావాలికదా? నువ్వు 'నా భర్త, నన్ను వదిలేసి మరొ కర్తిని కట్టుకున్నావు' అని కోర్టు కెక్కగలవా ? ఓ వేళ వెళ్ళినా అప్పుడు నేరం నీ మీదకే తిరగుతుంది ? నా మీదకా ! ఎలా ? పిచ్చిదానిలా గొణుక్కుంది.

"ఎలాగా ? నీ మనసు మారి పోయిందని, నీతో కాపురం చేయడం ఇష్టం ఇష్టంలేదని కోర్టుకో నా భర్త వాదిస్తాడు ?"

"అంటే ?"


"అంటే ఏంవీలేదు నీ శీలం చెడిపోయినట్లు రుజువు కూడా సృష్టించ గలడు నీ భర్త" ప్రశ్న, జవాబు కూడా తనే చెప్పుకుంటున్న ఇందిర ఆ పైన ఇక ఆలోచించలేకపోయింది.

"అయితే ఇప్పుడు నేనేం చేయను?" పిచ్చిదానిలా మనసుని ప్రశ్నించుకుంది.

"తిన్నగా నీ భర్త దగ్గర కెళ్ళిపో. అన్ని సమస్యలు వాటంతటవే సర్దుకు పోతాయి" మనసు హితబోధ చేయసాగింది.

"పిలవని పేరంటంగా వెళ్తే వాళ్లకి లోకువకానూ ?"

"నీ ఇంటికి నీవు వెళ్లడానికి బొట్టూ, కాటుకా పెట్టి పిలవాలా ? గుమ్మంలోకి వచ్చిన భార్యను ఏ మగవాడూ తూల నాడడు, చెండనాడుకోడు. ఓవేళ అన్నా, 'నా ఇంటికి నేను వచ్చాను' అను చాలు. దానిలో సిగ్గుపడాల్సింది, అవమానం పొందాల్సిందీ ఏంవీలేదు. అక్కడ చికాకులంటావా ? పెళ్లయిన ఆడబిడ్డలు, చదువుకునే మరుదులు ఎల్ల కాలమూ నీ దగ్గర పడివుండరు. వాళ్లు ఎటువంటివారైనా నీ భర్త గుణం నీకు తెలుసు కదా ? భార్య రాగానే అయినవారంతా విషమైపోయాము అనే మాట రావడం ఆయనకు ఇష్టంలేదు. రేపు నీకే ఓ కొడుకు పుట్టాడు. పెరిగి పెద్దయ్యాక పెళ్లి చేస్తావు. భార్యమీద మోజుతో, నిన్ను నీ భర్తను చిన్న చూపు చూస్తాడు — అప్పుడు నీ మన



సెలా వుంటుందో ఒక్కసారి ఆలోచించి చూడు నీకే తెలుస్తుంది ఆ మానసిక వేదన ఎంతనరకమో అందుకే ఓర్చుకో, ఆ ఓర్పే నీకు కొండంత ఆనందాన్ని, తృప్తిని ఇస్తుంది, పంకజాన్ని చూడు ఎలా మారిపోయిందో? తన చుట్టూ శాంత మనే కోటని కట్టుకుంది. పదిమంది కోసం నవ్వుతూ బ్రతుకుతున్నది. ఆడదిగాని మగాడు కాని, 'ఇది నా యిల్లు, నా పిల్లలు, నా భర్త లేదా, నా భార్య, పిల్లలు, నా ఇల్లు' అనే స్వార్థంతో తనచుట్టూ ఓ గిరిగీసుకుంటే, అది అతనికే, లేదా ఆమెకే తృప్తిని ఆనందాన్ని ఇస్తుంది. అంతేగాక ఇది మా ఇల్లు, వీళ్లంతా నా వాళ్లు అనుకుంటే ఆ ఆనందాన్ని తృప్తిని పదిమందితోనూ కలిసి అనుభవిస్తాడు. మనసు లోతుల్లోంచి వివేకమనే జ్ఞానబోధ చేయసాగారెవరో. అన్నా వదినల భోజనమయింది కాబోలు అన్నగారు బ్రేవ్‌మని తేనుస్తూ వస్తున్నాడివతలకు. చేతిలోని వుత్తరాన్ని ఎక్కడనుంచి తీసిందో అక్కడ పెట్టేసి ఏమీ ఎరగనట్లు ఆ వారం వీక్లీ చేతిలోకి తీసుకుంది ఇందిర.

ఆ రాత్రి కలతగా పట్టిన నిదురలో తను తిరిగి అత్తవారింటికి వెళ్ళినట్లు "ఎందుకు వచ్చావు ? సిగ్గు లేకపోతేసరి తగుదునమ్మా అంటూ వచ్చావా ? ఛీ-పో' అంటూ భర్త ఓ వైపు, అత్తగారు ఓ వైపు దుయ్యపట్టుతున్నట్లు కలవచ్చి తృళ్ళిపడి లేచింది. కలవరం తగ్గి కలగా గుర్తించి ఓ గ్లాసు మంచి నీళ్ళు త్రాగి పడుకుంది మళ్ళీ. ఆ మర్నాడు కాఫీ టిఫిన్‌లు అయిన తర్వాత ప్రకాశం

ఎక్కడికో ప్రయాణ మవసాగాడు. బహుశా అన్నయ్య వెళ్లేది ఉత్తరం రాసిన ఫ్రెండు దగ్గరకు కాబోలు, అనుకున్న ఇందిర తనూ చీరమార్చుకుని సూట్ కేస్ సర్దుకుంది.

"ఈ ఒక్కరోజు సెలవు కోసం ఎక్కడికి నువ్వూ బయలుదేరావు? రేపు కూడా సెలవు పెట్టావా?" అడిగింది వసంత.

"అన్నయ్యతో నేనూ వెళ్తున్నా రేపు అక్కడనుంచి ఆఫీసుకి రాజీనామా లెటర్ పంపిస్తాను వదినా?" ఆ మాటకి ప్రకాశమూ వసంతా కూడా అదిరిపడి ముఖ ముఖాలు చూసుకున్నారు.

"రాజీనామా ఇస్తావా? ఎందుకని?"

"నేను గుంటూరు వెళ్ళిపోతున్నాను అన్నయ్యా" తల వంచుకుని నిదానంగా చెప్పింది ఇందిర.

"గుంటూరు వెళ్ళిపోతావా? అక్కడ నుంచి ఉత్తరం వచ్చిందా నిన్ను రమ్మని..." ప్రకాశం ఆశ్చర్యాన్నుంచి చప్పున తేరుకోలేకపోతున్నాడు. తను వినేది నిజమేనా లేక భ్రమపడుతున్నాడా? కాని తను వినేది ఇందిర నోట్లోంచి వచ్చే మాటలేను.

"నా ఇంటికి నేను వెళ్ళడానికి ఉత్తరా లెందు కన్నయ్యా!" నవ్వింది ఇందిర. నా అంతట నేను వచ్చాను, తిరిగి నా అంతట నేను వెళ్ళిపోతున్నాను. నీకు రావాలని వుంటే స్టేషన్‌కి వచ్చి బండెక్కించు. లేదా అదీ అక్కర్లేదు. నేనే వెళ్ళిపోతాను" అంది అలా అంటున్న చెల్లెలి వైపు ప్రేమగా, ఆప్యాయతగా చూసాడు ప్రకాశం, దగ్గరగా వెళ్ళి -మె తల మీద చేయివేసి నిమురుతూ నా చెల్లెలు తిరిగి భర్త దగ్గరకు వెళ్తా నంటుంటే అంతకన్న నాకు కావల్సిం దేమిటమ్మా. నువ్వ సంతోషంగా, సంసారం చేసుకోవడమే నేను హర్షిస్తాను. స్టేషన్‌కే కాదు నీ వెంబడి గుంటూరు వచ్చి నిన్ను నీ అత్తవారింటిలో దింపి మరీ వస్తాను. కాని ముందు మనం వెళ్ళాల్సింది స్టేషన్‌కి కాదు. బజారుకి. ఇన్నాళ్ళ తర్వాత నా చెల్లెలు అత్త వారింటి కెళ్తుంటే వట్టినే ఎలా పంపిస్తాను. ముందు బజారు వెళ్ళి నీకు కావాల్సిన చీర, రవిక తెచ్చుకో. ఆ తర్వాత ట్రెయిన్‌కి వెళ్దాము ఏం? ఉండు వెళ్ళి టాక్సీ తీసుకొస్తాను" అంటూ ప్రకాశం వీధిలోకి పరుగెత్తాడు. ఇన్నాళ్టికైనా ఆడబిడ్డ మనసు మార్చుకుని భర్త దగ్గరకు వెళ్ళిపోతున్నందుకు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఆడబిడ్డ వైపు ప్రేమగా అభిమానంగా చూడసాగింది వసంత. కాని ఇందిర మాత్రం తను అత్త వారింటిలో ఎటువంటి దృశ్యాన్ని ఎదుర్కోవలసి వస్తుందో, అనే ఆలోచనతో సతమత మవసాగింది.